# బాబా కథలు



— మహర్షి

(భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి "చిన్నకథ" జగత్ ప్రసిద్ధం. అది అన్ని భాషల వారికి చిన్నకథే. ఆ చిన్న కథలో ఎన్నో, ఎన్నెన్నో భావార్థాలు, గూఢార్థాలు నిక్షిప్తమై వున్నాయి. వాటిని ఆస్వాదించి, ఆనందించి, తరించండి. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్యోపన్యాసాల నుండి స్వీకరించి రచించిన ఆర్.సీతాలక్ష్మిగారి చిన్న కథ ఆధారముతో... మహర్షి)

ఒక ఊరిలో ఒక సంగీత విద్వాంసుడు ఉండేవాడు. అతడు కొంత మంది ఇళ్ళకు వెళ్లి వారి పిల్లలకు సంగీతం నేర్పించి, సంసార నిర్వహణ సాగించెడివాడు. అతడు ప్రతిరోజూ ఉదయం ఎనిమిది గంటలకు ఇంటి నుండి బయలుదేరి వెళ్లి పిల్లలకు సంగీత పాఠాలు నేర్పి మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఇంటికి చేరెడివాడు. అతని కోసం అతని భార్య భర్త వచ్చే వరకూ వేచి వుండెడిది. ఇద్దరు కలిసి భోజనం చేసేవారు. సంగీత పరీక్షలు దగ్గర పడటం వలన ఆ విద్వాంసుడు పిల్లలకు మరికొంత సమయం ఎక్కువ తీసుకుని పాఠాలు చెప్పడం మొదలు పెట్టాడు.

విద్వాంసుడు ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు వచ్చాడు. అంత ఆలస్యం అయ్యేటప్పటికి అతని భార్య ఆకలి బాధ తట్టుకోలేక పోయింది. అందువలన భర్త రాగానే బావి దగ్గర చేదపెట్టి త్వరగా స్నానం చేసి రమ్మని భర్తకు చెప్పింది. భార్య చెప్పిన మాటలను విని భర్త త్వరగా స్నానం ముగించాలనే తొందరలో ఒక చేదనీళ్ళు తలపై నుండి పోసుకుని ముఖానికి సోపు పట్టించుకుని వుండటం వలన కళ్ళు మూసుకుని, సరిగా గమనించక చేదతాడు రెండు బావిలో పడటం గమనించలేదు. బావిలో పడిన తరువాత అతడు "రామా! భారము నీదే నురా! రామా! భారము నీదేనురా!" అంటూ రాగతాళయుక్తముగా పాట పాడటము మొదలెట్టాడు. భర్త ఎంత సేపటికీ స్నానం చేసి రాక పోవటంతో భార్య బావి దగ్గరకు వచ్చింది. అక్కడ సంగతి గ్రహించింది. భర్త మాత్రం "రామా! భారము నీదేనురా!" అంటూ గానం చేస్తూనే ఉన్నాడు.

వెంటనే ఆమె ఎవరినైనా పిలిచి బావిలో పడిన

## మానవ ప్రయత్నం

చేదను బయటకు తీయించే ప్రయత్నము చేయాలి కానీ, మనమేమీ ప్రయత్నం చేయకుండా కళ్ళు మూసుకుని భారము నీదేనురా అని గంటల తరబడి పాటలు పాడితే బావిలోని చేద బయటకు వస్తుందా? అని భర్తను మందలించి, స్నానానికి నీళ్ళు అందించి తరువాత చేదను బయటకు తీయించింది.

ఏ పనిని చేయాలన్నా మన ప్రయత్నం ప్రధానం. మన శక్తి సామర్థ్యాలను వినియోగించకుండా భారమంతా భగవంతుని మీద వేస్తే భగవంతుడు కూడా అనుగ్రహించడు. దేనికైనా మానవ ప్రయత్నం అత్యవసరం. భగవదత్తమైన శక్తి సామర్థ్యాలను సాధ్యమైనంత వరకు ఉపయోగించి దైవ కృపను ఆశించాలి. స్వప్రయత్నం లేకుండా ఏ పనిని చేయకూడదని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా చెబుతుంటారు.

## చిట్కాలు

నేటి మహిళలకు వంట ఇల్లే దేవాలయాలు అయిపోయాయి. అందువల్ల మహిళలకు వంట ఇంటి చిట్కాలు అందిస్తున్నాను.

(1) బాగా పండిన అరటి పళ్ళను మరో రకంగా కూడా వాడుకోవచ్చు. మెత్తగా పిసికి కాస్త నిమ్మరసం కలిపి ఫ్రిజ్‌లో పెట్టండి. కేకులు తయారు చేసుకునేటపుడు వేసుకుంటే మంచి సువాసన వస్తుంది.

(2) ఏ కూరయినా మరి ఘాటుగా తయారయితే కాస్త పెరుగు కలపండి. ఘాటు తగ్గుతుంది.

(3) మిరపకాయల్ని వేయించేటప్పుడు గొంతు పట్టు రాకుండా వుండడానికి వాటిలో కాస్త ఉప్పు కలపండి.

(4) చపాతీలు రకరకాల రంగుల్లో రుచిగా చేసుకోవడానికి వీలుంది. కారట్ రసంతో పిండి కలుపుకుంటే ఆరంజిరంగు చపాతీలు, బీట్‌రూట్ రసంతో కలుపుకుంటే ఎర్రరంగు చపాతీలు, సన్నగా తరిగిన మెంతి ఆకులు కలిపితే ఆకుపచ్చ చపాతీలు తయారవుతాయి పిల్లలకు బోరుకొట్టకుండాను ఉంటుంది. బలర్థకం గానూ ఉంటుంది.

(5) చేప ముక్కల్ని వేయించే ముందు నిమ్మరసం కలిపిన నీళ్ళలో గంటసేపు నాననివ్వండి. దీనివల్ల చేపల రుచి పెరగడమే కాక "నీసు" వాసన లేకుండా పోతుంది.

– ముద్దా విజయలక్ష్మి.

### మళ్ళీ రండి

మిస్టర్ జోగి. నువ్వు అదే షాపులో మళ్ళీ దొంగతనానికి వెళ్ళటానికి కారణం? సూటిగా ప్రశ్నించాడు లాయర్."

"ప్లీజ్ విజిట్ ఎగైన్" అని వ్రాసి వుంటే, తాపీగా జవాబిచ్చాడు జోగి.

— డి.వి.యల్.నరేంద్ర,
విద్యానగర్.